క్లుప్తంగా

చర్చిల్లో తలారి ప్రార్థనలు



వేగేశ్వరపురం చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలారి

తాళ్లపూడి: దేవుడి ఆశీర్వాదం, దైవసేవకుల సహకారం తమకు అందజేయాలని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజక వర్గ ఇన్‌చార్జి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని తిరుగుడుమెట్ట, పెద్దేవం, వేగేశ్వరపురం గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం ఆయన నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని, తనను ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. చర్చి ఫాదర్లు ప్రత్యేక ప్రార్థులు చేశారు. ఆయన వెంట ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు తిగిరిపల్లి వెంకటరావు, కొమ్మిరెడ్డి పరశు రామారావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని పాదయాత్ర



రాజేంద్రనాథ్‌కి స్వాగతం పలుకుతున్న మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు: జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని కోరుతూ రాజవోలు నుంచి దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని నిర్మల గిరి మేరీ మాత గుడి వరకు నక్కా రాజేంద్ర నాథ్ చేపట్టిన పాదయాత్ర ఆదివారం కొవ్వూరు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజేంద్రనాథ్‌కి టోల్ జంక్షన్ వద్ద స్వాగతం పలికారు. ఆ యువకుడికి పూల దండలు వేసి అభినందించారు. పట్టణ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు సిద్దన వాసు, మాజీ కౌన్సిలర్ బావన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

తాళ్లపూడి: బల్లిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులు, దాతలు దుగ్గిరాల వెంకటరత్నం భాస్కరం దంపతులు ఆధ్వర్యంలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించారు. ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మహాగణపతి, ఆంజనేయ స్వామి విగ్రహాలను వేదపండితులు వేదమంత్రోచ్చరన మధ్య ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ అర్చకులు కాళ్లకూరి వెంకటరత్నం పూజ, ప్రతిష్ట కార్యక్రమాల్ని పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భారీగా అన్న సమారాధన నిర్వహించారు.

జనసేన గ్రామ అధ్యక్షుడి రాజీనామా



పుట్టా కాశీవిశ్వనాథ్

దేవరపల్లి: జనసేన పార్టీలో రాజీనామాల పర్వం మొదలైయింది. యర్నగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు పుట్టా కాశీవిశ్వనాథ్ ఆదివారం అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్టు విలేకరులకు తెలిపారు. రాజీనామా లేఖను నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజుకు అందజేసినట్టు ఆయన చెప్పారు. వ్యక్తి గత కారణాల వల్ల పదవికి రాజీనామా చేశానన్నారు.



కొవ్వూరులో పల్స్ పొలియో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి



పెరవలి బస్‌స్టాండ్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కృష్ణవేణి



అట్లపాడులో చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు



దేవరపల్లి పీహెచ్‌సీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ దుర్గారావు



వేగేశ్వరపురంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

పోలియో మహమ్మారిని తరిమేద్దాం

- హోం మంత్రి తానేటి వనిత
- పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం
- చిన్నారులకు పోలియో చుక్కలు



పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు



పెద్దేవంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే తలారి

నల్లజర్ల: చిన్నారులకు అనారోగ్యం సమస్యలు రాకుండా రెండు చుక్కలు వేసి పోలియో మహమ్మారిని తరిమి కొడదామని, ఇది అందరి బాధ్యత అని, ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. ఆదివారం నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి వనిత మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు వయస్సు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలన్నారు. ఈ కార్యక్రమం సోమ, మంగళవారాల్లో కూడా కొనసాగుతుందన్నారు. పీహెచ్‌సీ డాక్టరు తెల్లం గంగాధరరావు, సర్పంచ్ పల్లిజ్యోతి, ఎంపీటీసీలు మేణ్ణి వెంకటలక్ష్మి, వామిశెట్టి పావనీకుమారి, మండల కన్వీనర్ గగ్గరశ్రీనివాస్, కారుమంచి రమేష్, పెండ్యాలరే రామకృష్ణ, ముప్పిడి వెంకటరత్నం, వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, మద్దిపాటి ప్రసాద్, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, కరుటూరి లక్ష్మీగణేశ్వరావు, బండిచిట్టీ, నక్కాపండు, సయ్యద్ మునాఫ్, యలమర్తివాసు తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి కృషి

తాళ్లపూడి: పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావు అన్నారు. మండలంలో ఆదివారం పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమం నిర్వహించారు. తాళ్లపూడి, మలకపల్లి, అన్నదేవరపేట పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో పోలియో కేంద్రాల వద్ద 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా పెద్దేవం సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో తలారి వెంకటరావు పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో 90 శాతం పూర్తయింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ, వల్లభశెట్టి శ్రీనివాస్, పిట్టా శ్రీనివాస్, సర్పంచ్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారి

తాళ్లపూడి: మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద పోలియో కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో)కె.వెంకటేస్వరరావు పరిశీలించారు. అక్కడున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంఅండ్ హెచ్‌వో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 1,90,470 మంది పిల్లలు లక్ష్యంగా పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశామని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. సోమ, మంగళవారాలు కూడా పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఆయన వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

పెరవలి మండలంలో 96 శాతం పూర్తి

పెరవలి: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతమైంది. పెరవలి పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్ల లోపు పిల్లలు 4820 మంది ఉండగా 4578 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు ఏ కృష్ణవేణి తెలిపారు. 95.02 శాతం జరిగినట్లు అయ్యిందన్నారు. కానూరు పీహెచ్‌సీ పరిధిలో 97 శాతం పూర్తయిందన్నారు.

98 శాతం పూర్తి

దేవరపల్లి: పోలియో చుక్కల కార్యక్రమం ఆదివారం దేవరపల్లి మండలంలో విజయవంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాల వద్ద వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. బస్టాండ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేశారు. దేవరపల్లి మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో 9583 మంది పిల్లలకు గాను 9294 మంది పిల్లలకు చుక్కలు వేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. మిగిలిన పిల్లలకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికి వెళ్లి సిబ్బంది చుక్కలు వేస్తారని దేవరపల్లి వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావు తెలిపారు. ఇప్పటికి 98 శాతం పూర్తయిందన్నారు. దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 4308 మంది పిల్లలకు గాను 4121 మందికి, యాదవోలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 3266 మందికి గాను 3202 మందికి, గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 2083 మందికి గాను, 1867 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ సీహెచ్ హరిచందన, బి. ప్రశాంత్, సీహెచ్‌ఓలు అప్పారావు, చిన్నికృషణుడు, దేవరపల్లిలో సర్పంచ్ కడిమి వీరకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: పోలియో రహిత సమాజం నిర్మించేందుకు విధిగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని జెడ్పీటీసీ నందిగం భాస్కర రామయ్య అన్నారు. వేలివెన్నులో భాస్కర రామయ్య, పాలంగిలో ఎంపీపీ పాలేటి యల్లారేశ్వరిలు చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యాధికారి ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ 5059 మంది చిన్నారులుండగా 4815 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. ఈ కార్యక్రమాల్లో వైస్‌ఎంపీపీ చెట్టి నవీన్, ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, డాక్టర్ ఆర్.ఉషాదేవి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వూరులో...

కొవ్వూరు: ప్రతిఒక్కరూ చిన్నారులకు పోలియో చుక్కలు విధిగా వేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. పట్టణంలో మొత్తం 4,365కి గాను తొలి రోజు 4,277 మంది పోలియో చుక్కలు వేసినట్టు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి టి.సుష్మ తెలిపారు. కో-ఆప్షన్ సభ్యులు ఎండీ ఆలీ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వాడపల్లి గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ ప్రారంభించారు. దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలో 4,485 మంది చిన్నారులు లక్ష్యంగా 96శాతం మందికి వేసినట్టు వైద్యాధికారి ఎస్.ధర్మరాజు తెలిపారు. 12 సచివాలయాల పరిధిలో 28 బూత్‌లు ఏర్పాటు చేసి పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించామన్నారు. 120 వైద్య సిబ్బంది విధుల్లో పాల్గొన్నారని అన్నారు.



వేలివెన్నులో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ భాస్కరరామయ్య

నిడదవోలు రూరల్‌లో...

నిడదవోలు రూరల్: అయిదేళ్ల లోపు పిల్లలందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించాలని నిడదవోలు జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు సూచించారు. మండలంలోని అట్లపాడు గ్రామంలో చిన్నారులకు సూరిబాబు పోలియో చుక్కలు వేశారు. సమిశ్రగూడెం, తాడిమళ్ల, మార్కొండపాడు, కానూరు పీహెచ్‌సీ పరిధిలోని చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేశారు. ఈకార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలులో...

నిడదవోలు : పోలియోరహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేసి నేషనల్ పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ సమాజంలో ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండాలంటే ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రులు ఒక సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. పట్టణ పరిధిలో 38 పోలియో కేంద్రాల ద్వారా 5,197మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యం కాగా మొదటి రోజు 4,992 మంది చిన్నారులకు వేశామని నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఈ. తేజశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, బిర్రె పార్వతి, ఆలమూరి భారతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఆదరించండి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- కలవచర్ల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం



కలవచర్ల గ్రామంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలు మండలంలోని కలవచర్ల గ్రామంలో మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు బోనేపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు 57 నెలలుగా అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, యాళ్ల రామారావు, వెలగన నరేష్, పులుమంతుల రామారావు, జువ్వల చక్రధర్, పాతాల ఆనంద్, జువ్వల రమేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

భగవంతుని సేవే మహాభాగ్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పెరవలి: భగవంతుని సేవ చేయటమే మహాభాగ్యమైతే అందులో మహా కుంభాభిషేకంలో పాల్గొని స్వామి, అమ్మవారికి సేవ చేయడం తన పూర్వ జన్మ సుకృతమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. మల్లేశ్వరంలో ఉన్న కపిల మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న మహాకుంభాభిషేకం చివరి రోజు పాల్గొని ఆలయ శిఖరంపై కుటుంబ సమేతంగా బూరులు వేసి అనంతరం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. బీ సందర్భంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులకు చీరలు, గాజులు, పసుపు కుంకుమ పంపిణీ చేశబూరు. వచ్చిన భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ పార్టీ మండల అధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల, పట్టాభి, సర్పంచులు, ఎంపీటీలు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

దేవరపల్లి: ఎండల తీవ్రత పెరుగుతున్నందున ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు యర్నగూడెంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ స్థానిక బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూలు 2002–2005 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని సర్పంచ్ బొంతా భరత్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరహరిశెట్టి దొరబాబు, ఎస్సై కె. శ్రీహరిరావు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

బుల్లెట్ బైక్ చోరీపై కేసు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ (బుల్లెట్) బైక్ చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్‌వీవీ రమేష్ ఆదివారం తెలిపారు. సమిశ్రగూడెం గ్రామానికి చెందిన మహ్మద్ జావిద్‌కు చెందిన బుల్లెట్ బైక్ గత నెల 7వ తేదీన ఇంటి వద్ద పార్కింగ్ చేసి పెట్టగా గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి అపహరించినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నిడదవోలు రూరల్: జీడిగుంట గ్రామానికి చెందిన ముప్పిడి శ్రీనివాస్ అక్రమంగా మద్యం విక్రయించడంతో ఆదివారం అరెస్టు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎస్ఎస్‌వీవీ రమేష్ తెలిపారు. శ్రీనివాస్ వద్ద మూడు బీర్లు, 8 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనపర్చుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



కలవచర్లలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులైన పలువురు యువకులు జనసేన పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో ఆదివారం చేరారు. జనసేన కలవచర్ల గ్రామ ఉపాధ్యక్షుడు వేము వినిల్ కుమార్, యువకులు మురళీ, ఆబేతు, యాకోబు, మహేష్, సియోన, కమల్‌కుమార్‌లకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పార్టీ కండువ కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, పార్టీ గ్రామ అధ్యక్షుడు బోనేపల్లి సుబ్బారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సుపరిపాలన

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత



చిన్నాయిగూడెం సభలో మాట్లాడుతున్న మంత్రి వనిత

దేవరపల్లి: బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితోనే ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వాహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. మండలంలోని సంగాయిగూడెం, చిన్నాయిగూడెం గ్రామాల్లో ఆదివారం రాత్రి జరిగిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయస సమ్మేళనం సభలో మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సభలకు మండల పార్టీ కన్వీనర్ కూచిపూడి సతీష్ అధ్యక్షత వహించారు. మంత్రి వనిత మాట్లాడుతూ విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చి విద్యకు జగనన్న పెద్దపీట వేశారని అన్నారు. నాడు–నేడు కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ బడులను కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను మాఫీ చేసి మహిళల ఆత్మగౌరవాన్ని జగనన్న నిలబెట్టినట్లు ఆమె చెప్పారు. కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలను తీసుకు వచ్చి అన్ని వర్గాల మహిళలను ఆదుకున్నట్లు ఆమె తెలిపారు. రైతుల అండగా నిలబడ్డారన్నారు. మేనిఫెస్టోలో 25లక్షల ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి 32 లక్షలు అందించారన్నారు. గత ప్రభుత్వంలో పేదలకు 12 శాతం ఉండగా జగనన్న ప్రభుత్వంలో 6 శాతం తగ్గిందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గూడూరిశ్రీనివాసరావును ఎంపీ అభ్యర్థిగా గెలిపించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దన, ఎంపీపీ కేవీకే దుర్గారావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి గడ జగదీష్, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రప్రసాద్, మండల కేపీ కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మేడిబోచిన గంగరాజు, చిన్నాయిగూడెం ఎంపీటీసీ సభ్యురాలు మరపళ్ల నాగమణి, పలువురు నాయకులు కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను మంత్రి వనిత పరిచయం చేసుకున్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



త్యాజంపూడిలో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వనిత

దేవరపల్లి: మండలంలోని త్యాజంపూడి దళితవాడలో గడపగడపకూ నిధులు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నాలుగు సిమెంట్ రోడ్లకు రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ మంత్రి తానేటి వనిత శనివారం రాత్రి శంకుస్థాపన చేశారు. రెండు విడతలుగా రూ. 32.40 కోట్లు మంజూరు కాగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు ఆమె చెప్పారు. ఇందులో రూ.20లక్షలతో దళితవాడలో నాలుగు సిమెంట్ రోడ్ల వేస్తున్నట్టు తెలిపారు. గ్రామ సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి, ఉపసర్పంచ్ కుసులూరి వెంకటసతీష్, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైస్ ఎంపీపీ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సతీష్, నాయకులు పాల్గొన్నారు.



నల్లజర్లలో నిర్మాణం పూర్తయిన ఓవర్‌హెడ్ ట్యాంకు

తీరనున్న ప్రజల కష్టాలు

- శరవేగంగా వాటర్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం
- మరిన్ని గ్రామాలకు జలజీవన్ పథకం
- రూ.16.06 కోట్లతో పనులు



పైపులైన్లు వేస్తున్న కూలీలు

నల్లజర్ల: ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటే లక్ష్యంగా గ్రామాల్లో జరుగుతున్న జలజీవన్ మిషన్‌లో (జేజేఎం)మరిన్ని గ్రామాలకు చోటుదక్కింది. మండలంలో తొలివిడతలో 13 గ్రామాలు, మలి విడతలో 11 గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. ఇంటింటికీ కుళాయి ఏర్పాటులో భాగంగా పైపులైన్లు, నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అవసరమైన చోట ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులన్నీ వివిధ దశలలో ఉన్నాయి. ప్రభుత్వం రూ.16.06 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామాల్లో పైపులైన్ల పనులు జరుగుతున్నాయి. మండలంలోని మొత్తం 24 గ్రామ పంచాయతీల్లో 104 కిలోమీటర్ల మేర పైపులైన్లు, 5 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. మొదటి దశలో 12 గ్రామాలకు 54 పైపులైను, నల్లజర్లలో 1.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు, ముసుళ్లగుంటలో 40వేల లీటర్ల గల వాటర్ ట్యాంకు, ఆవపాడులో 40 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంకులు మంజూరు చేసింది. వీటి నిర్మాణానికి రూ.5.56కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో వాటిని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పోతవరంలో ప్రత్యేక ప్యాకేజీగా రూ.కోటితో పైపులైను, 2 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు.

రెండోదశలో మిగిలిన 12 గ్రామాలకు 50కిలోమీటర్ల పైపులైను, నబీపేటలో 40 వేల లీటర్ల సామర్థ్యంగల వాటర్ ట్యాంక్, గంటావారిగూడెంలో 40 వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించనున్నారు.

ఆరు నెలల్లో పూర్తి చేస్తాం



మొదటి, రెండో దశ పనులన్నీ మరో ఆరు నెలల్లో పూర్తి చేస్తాం. ఈ పనులను టెండర్ ద్వారా బీఆర్ ఇన్‌ఫ్రా సంస్థ దక్కించుకుంది. పనులు కూడా చేపట్టింది. దాదాపు 50 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు ఆరు నెలల్లో పూర్తి చేయిస్తాం.

– అజయ్‌బాబు, ఏఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, నల్లజర్ల